క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించి, శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


కల్యాణ్ (ఫైల్)

పీఎం పాలెం: ఓ యువకుడు అదృశ్యమైన ఘటనపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 5వ వార్డు పరిధి కొమ్మాది రాజీవ్ గృహకల్ప కాలనీలోని బ్లాక్ నంబర్ 18 టీఎఫ్ 5లో నివసిస్తున్న పొన్నాడ కల్యాణ్ (24) కార్పెంటర్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 19వ తేదీ ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. అతని కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేకపోవడంతో కల్యాణ్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మధురవాడలో ఆగని ఆక్రమణలు


శ్రీలక్ష్మీనగర్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్‌లు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 27 శివశక్తినగర్ రోడ్డులోని శ్రీలక్ష్మీనగర్‌లో ఆక్రమణలు ఆగడం లేదు. కొమ్మాది జంక్షన్ నుంచి శివశక్తినగర్ వరకు వ్యాపించి ఉన్న కొండ కింది భాగంలో మాస్టర్ ప్లాన్ రోడ్డుకు ఆనుకుని సుమారు అర ఎకరం స్థలంలో డజను వరకు ఆర్‌సీసీ రేకులు షెడ్లు వెలిశాయి. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయిపోతున్నా రెవెన్యూ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

‘కోర్టు ఆదేశాలున్నా కూల్చేశారు’



మాట్లాడుతున్న అప్పల కొండ, భరత్

భీమునిపట్నం: కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా తమ నివాసాన్ని కూల్చివేసిన జీవీఎంసీ అధికారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కొంగరాని అప్పల కొండ, పల్లా భరత్‌కుమార్ కోరారు. శుక్రవారం వారు భీమిలి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పెద్దబజారు గంటస్తంభం కూరగాయల మార్కెట్‌లో షెడ్డును నిర్మించుకుని సుమారు 50 సంవత్సరాలుగా నివాసముంటున్నామని తెలిపారు. ఇటీవల ఇక్కడ కొత్త మార్కెట్ నిర్మాణం పనులు ప్రారంభించారని, తమ నివాసాన్ని తొలగించాలని అధికారులు కోరగా.. కోర్టుకు వెళ్లామని, తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తమ నివాసాన్ని కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మళ్లీ కోర్టుకు వెళ్తామని వెల్లడించారు.

భీమిలికే తలమానికంగా..

రూ.2.5 కోట్లతో కొత్త మార్కెట్
- చురుగ్గా నిర్మాణ పనులు
- త్వరలో అందుబాటులోకి..

భీమునిపట్నం: భీమిలి మెయిన్‌రోడ్డులో గంటస్తంభం పక్కన అధునాతన మార్కెట్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న మార్కెట్ స్థానంలో భీమిలికే తలమానికంగా నిలిచేలా ప్రభుత్వం నూతన నిర్మాణం చేపడుతోంది. ఇక్కడ గత 50 సంవత్సరాలుగా కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలకు సంబంధించిన మార్కెట్ ఉంది. అంతంత మాత్రంగా సదుపాయాలు ఉన్న ఈ మార్కెట్‌లోనే ఇన్ని సంవత్సరాలు విక్రయాలు జరిగాయి, కాని, పది సంవత్సరాలుగా ఇక్కడి షెడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పరిస్థితి అధ్వానంగా ఉండేది. విరిగిపోయిన షెడ్లల్లో, పగిలిపోయిన నేలపైనే వ్యాపారాలు చేయాల్సి వచ్చేది.

చకచకా పనులు

ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం ఇక్కడ కొత్త మార్కెట్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేయడంతో, ప్రభుత్వం దాన్ని మంజూరు చేసి నిధులను కూడా విడుదల చేసింది. దీంతో పాతషెడ్లు తొలగించి, దాని స్థానంలో కొత్త షాపుల నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరగా మార్కెట్ నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. కాగా, మార్కెట్‌ను ఆనుకుని ఉన్న వేదిక ముందు స్థలంలో షామియానాలు, పటిష్టమైన పెద్ద గొడుగుల లాంటివి అధికారులు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం వ్యాపారులు అక్కడే విక్రయాలు సాగిస్తున్నారు.

అధునాతన వసతులతో నిర్మాణం : ఇక్కడ అధునాతన పద్ధతిలో షాపుల నిర్మాణం జరుగుతోంది. కూరగాయలు, చేపలు, మాంసం విక్రయాలకు సంబంధించి విడివిడిగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ముందు వైపు 12 షాపులు నిర్మిస్తున్నారు. ఇందులో కూరగాయలు, కిరాణా సామగ్రి విక్రయాలు జరగనున్నాయి. దాని వెనుక భాగంలో 28 చిన్న షాపులు రైతుబజారు తరహాలో నిర్మాణాలు చేయనున్నారు. వీటిల్లో చేపలు, మాంసం విక్రయాలు జరుగుతాయి. అలాగే ఇందులో పేవ్‌మెంట్ ఉంటుంది. దీంతో పాటు విద్యుత్, నీరు, మరుగుదొడ్లు సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా చేపలు విక్రయించే వారు చేపలు నిల్వ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. భీమిలికే తలమానికంగా నిర్మిస్తున్న మార్కెట్, ఇక్కడి వసతులపై వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కొత్త మార్కెట్ నమూనా


తాత్కాలికంగా షామియానాల కింద నిర్వహిస్తున్న మార్కెట్


నిర్మాణంలో ఉన్న మార్కెట్

చాలా సంతోషంగా ఉంది



శిథిలమైన మార్కెట్‌లో ఎన్నో కష్టాలు పడుతూ వ్యాపారాలు చేశాం. ఇప్పుడు కొత్త మార్కెట్ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. త్వరలోనే మా దుకాణాలు అందుబాటులోకి వస్తాయి. మేం పడుతున్న కష్టాలు తీరిపోనున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– యర్రంశెట్టి ఇందిర, కూరగాయల వ్యాపారి

చేపలను నిల్వ ఉంచే సదుపాయం



ఇప్పుడు కొత్తగా నిర్మిస్తున్న మార్కెట్ మాకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. గతంలో మేం అమ్మగా మిగిలిన చేపలు పాడైపోయేవి. దీంతో బాగా నష్టపోయే వాళ్లం. ఇప్పుడు వాటిని నిల్వ ఉంచేందుకు కోల్డ్ స్టోరేజ్ సదుపాయం కల్పిస్తున్నారు. మా వ్యాపారులకు అది ఎంతో ఉపకారం.

– కాసరపు పోతమ్మ, చేపల వ్యాపారి

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



వ్యాపారులందరి ఇబ్బందులు తీర్చేలా అన్ని సదుపాయాలతో ప్రభుత్వం కొత్తగా మార్కెట్ నిర్మించడం ఎంతో బాగుంది. మా బాగోగులు ఆలోచించి, మాకు ఇంత మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– కె.రాజు, కూరగాయల వ్యాపారి

నాణ్యతతో నిర్మాణ పనులు

ఈ మార్కెట్ నిర్మాణం విషయంలో తీసుకోవలసిన అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నాం. ముఖ్యంగా నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నాం. అనుకున్న సమయానికి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తాం.

– వేమూరి వెంకటేశ్వరరావు, ఈఈ (పబ్లిక్ వర్క్స్), జీవీఎంసీ

భక్తులకు అన్నదానం


దుర్గాలమ్మ ఆలయం వద్ద అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం పలువురు భక్తులకు అన్నదానం చేశారు. రేవళ్లపాలేనికి చెందిన జోస్యుల ఉమా శంకరరావు కుమారుడు జైసూర్య కుటుంబ సభ్యుల సహాయంతో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన సూర్యనారాయణ, ధనలక్ష్మి ఉదయం భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. వైశాఖ మాసం బహుళ పాడ్యమి సందర్భంగా అమ్మవారికి ఉదయం కుంకుమ పూజ, పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పీవీజీ అప్పారావు, నాగోతి తాతారావు, పిల్లా శ్రీనివాసరావు, పిల్లా వెంకటరమణ, సూరిపాత్రుడు, పిల్లా అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

మధురవాడ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం మధురవాడలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన రెండు కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ కె.సువర్ణ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ స్కూల్లో 2 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఒక కేంద్రంలో 78మందికి గాను 41మంది, మరో కేంద్రంలో 94కు గాను 64మంది విద్యార్థులు హాజరయ్యారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు

భీమునిపట్నం: భీమిలిలోని యోగా చైతన్య సంస్థలో బాల బాలికలకు నిర్వహించిన యోగా తరగతులు శుక్రవారం ముగిశాయి. 9 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల లోపు బాల, బాలికలు 348మందికి ఈ నెల 1 నుంచి రెండు బ్యాచ్‌లలో యోగాలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంతో పాటు ఆహార అలవాట్ల వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు.

వీటిని తట్టుకోవాలంటే ప్రతీ ఒక్కరికి యోగా ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి పిల్లలకు యోగాలో శిక్షణ ఇప్పిస్తున్న తల్లిదండ్రుల ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. దీనిని ఇలాగే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, డి.నాగిరెడ్డి, ఎం.రాంబాబు, సిహెచ్.వెంకటరమణ, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.


యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

సమన్వయంతో వ్యాధుల నివారణ

తగరపువలస: జంతువుల ద్వారా మనుష్యులకు సోకే వ్యాధులను నివారించడానికి అన్ని శాఖల సమన్వయంతో ఐక్యకార్యాచరణ అవసరమని వన్ హెల్త్ కమిటీ ప్రతినిధి డాక్టర్ ప్రదీప్ తెలిపారు. జంతు సంబంధిత వ్యాధుల పరిశీలనకు అవసరమైన ప్రణాళికల తయారు కోసం శుక్రవారం ఆనందపురం మండలం గంభీరం, వేములవలస పంచాయతీలలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆయన సందర్శించారు. అక్కడి సిబ్బంది, పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, పశు వైద్యశాలల సిబ్బందితో సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా సందర్శన తరువాత ఒక నివేదిక తయారు చేయనున్నట్టు ఆయన తెలిపారు. జంతువుల నుంచి మనుష్యులకు సోకే వ్యాధులను గుర్తించి వాటి నివారణకు కృషి చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పశు వైద్యాధికారి రమ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్రప్రసాద్, ఆనందపురం పీహెచ్‌సీ వైద్యులు ఎం.గంగునాయుడు, షహనాజ్ సాదియా, ఆరోగ్య పర్యవేక్షకుడు కృష్ణమోహన్, ఎపిడెమిక్‌నల్ హెల్త్ అసిస్టెంట్ సోమేష్, తదితరులు పాల్గొన్నారు.


విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న వన్ హెల్త్ కమిటీ ప్రతినిధి డాక్టర్ ప్రదీప్

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 130 మంది ఎంపిక

భీమునిపట్నం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆకాంక్షించారు. భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద శుక్రవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న 130 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కష్టపడి చదివితే మంచి ఉద్యోగాలు వస్తాయనడానికి నిదర్శనం ఇక్కడ వందమందికి పైగా విద్యార్థినులు పలు సంస్థలకు ఎంపిక కావడమేనన్నారు. మిగిలిన విద్యార్థినులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకుని, మంచి ఉద్యోగాలు పొందడానికి ప్రయత్నించాలని కోరారు. అనంతరం ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, దినకర్ హిరావత్, బంగారు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థినులకు నియామక పత్రాలను అందిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

‘నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్’ పోస్టర్ ఆవిష్కరణ

ఏయూక్యాంపస్: యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ‘నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ ఆలుమ్ని సమావేశ మందిరంలో శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు, నటుడు షాహిద్ అబ్దుల్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని.. ఏపీలో జూన్ 15 వరకు, తెలంగాణలో జూన్ 17 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి, విజేతలుగా నిలిచిన వారికి ఫైనల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. విశాఖ వేదికగా ఫైనల్ పోటీలు జరుగుతాయని, పూర్తి వివరాలకు స్టార్ ఆఫ్ ఇండియా ఇన్‌స్టా పేజీని సందర్శించాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విభాగాలుగా మ్యూజిక్, డాన్స్, ఆర్ట్స్ రంగాల్లో అన్ని వయసుల వారి ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

కేంబ్రిడ్జి పరీక్షల్లో రాణించిన ఓక్రిడ్జ్ విద్యార్థులు



రిషి, ప్రణవ్ వర్మ

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఎస్‌డి రిషి, ఎస్‌కె ప్రణవ్ వర్మ ఇటీవల విడుదల అయిన కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ–2024 పరీక్షల్లో మొదటి రెండు స్థానాలు సాధించారు. వారు విద్యా విషయాలలోనే కాకుండా వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచారని స్కూల్ ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల, డైరెక్టర్ అమిత్‌జైన్ తెలిపారు. గతంలో రిషి యానిసెఫ్ జట్టులో తమ స్కూల్ నుంచి ప్రతినిధిగా పాల్గొన్నాడన్నారు. ప్రణవ్ వర్మ నాలుగు ఐక్యరాజ్య సమితి మోడల్ సమావేశాల్లో బెస్ట్ డెలిగేట్‌గా పాల్గొన్నాడని తెలిపారు. వీరిద్దరూ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ పోటీల్లో ఉన్నత విజయాలు అందుకున్నారని తెలియజేశారు.

ముగిసిన రాజ్యలక్ష్మి ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో మూడు రోజులుగా జరుగుతున్న రాజ్యలక్ష్మి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. గ్రామంలో బంధు, మిత్రులతో ఇళ్లు కళకళలాడాయి. గ్రామం జన సందోహంతో నిండిపోయింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

పద్మనాభం: దివ్యాంగ పిల్లలను చదివిస్తే ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తుందని ఎంఈవో పొన్నగంటి రమణ తెలిపారు. మండలంలోని మునివానిపాలెం, సామయ్యవలస, పాండ్రంగి గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రత్యేక ఉపాధ్యాయులు హెచ్.రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావులతో కలిసి బడి బయట ఉన్న 18 ఏళ్లలోపు దివ్యాంగ పిల్లల గుర్తింపునకు సర్వే చేశారు. ఈ సందర్భంగా రమణ దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. తల్లిదండ్రులు ఆత్మస్థైర్యాన్ని పెంచుకుని పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలన్నారు. ఈ నెల ఒకటి నుంచి 18 ఏళ్లలోపు ఉన్న దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జూన్ 9వ తేదీతో ఈ సర్వే పూర్తవుతుందన్నారు. ఇప్పటికే ఈ సర్వే ద్వారా బడి బయట ఉన్న 12 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించామని చెప్పారు. వారికి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే దివ్యాంగులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు, ఉపకరణాలు అందిస్తుందన్నారు. అనంతరం పాండ్రంగి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.


మునివానిపాలెంలో దివ్యాంగ చిన్నారిని పరిశీలిస్తున్న ఎంఈవో రమణ

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

మహారాణిపేట : ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్, జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌లతో కలిసి పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలపై ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు వేగవంతం కావాలని సూచించారు. అనంతరం మీడియా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితిని గమనించారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.


స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

సమతుల్య ఆహారం తీసుకోవాలి

పద్మనాభం: కిశోర బాలికలు ప్రొటీన్, ఐరన్‌లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని రేవిడిలో శుక్రవారం కిశోర బాలికలకు రుతుక్రమం జరిగే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విటమిన్–సీ ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. శానిటరీ నేప్‌కీన్స్ వాడే విధానం గురించి తెలియజేశారు.

రుతుక్రమంలో జాగ్రత్తలపై అవగాహన

తగరపువలస: రుతుక్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం భీమిలి మండలం చిప్పాడ గ్రామంలో భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగింది. మానసిక మహోత్సవం పేరుతో జరిగిన కార్యక్రమంలో రుతుక్రమం గురించి అపోహలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హ్యాండ్‌వాష్ పద్ధతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.రేఖావాణి, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, సహాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామారావు

వజ్రపుకొత్తూరు: అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జీడితోటల్లో శుక్రవారం గొర్లె ఉమామహేశ్వరరావు(26) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్.రామారావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడున్న ఐడీకార్డు ఆధారంగా మృతుడు విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డులో లేబర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఆనవాళ్లను బట్టి గురువారం రాత్రి ఉరి వేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. గుర్తింపు కార్డు తప్ప మరెలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో వివరాల కోసం నేవల్ డాక్‌యార్డును సంప్రదిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడు ఎరుపు చారలతో ఉన్న తెలుపు టీ షర్టు, నలుపు షార్టు(నిక్కర్)ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, వివరాలను తెలిసిన వారు వజ్రపుకొత్తూరు పోలీసులను సంప్రదించాలని కోరారు. వీఆర్వో రెయ్యిమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెంకన్నకు వైభవంగా పుష్పాంజలి సేవ

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం పుష్పాంజలి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో దేవాలయాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఆలయ మండపంలో అష్టదళ పద్మారాధన, పాలికా ఉద్వాసన, ద్వాదశార్చనలు, విశేష నివేదనలు, ఆలయ ప్రాంగణ ప్రదక్షిణలు చేపట్టారు. అనంతరం అర్చక స్వాములు నిర్వహించిన పూబంతుల ఆట భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామికి నివేదించిన విశేష హారతులు భక్తులను అలరించాయి. అనంతరం స్వామివారి పవళింపు సేవ కనులపండువగా చేపట్టారు.